పర్యావరణ పరిరక్షణపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న స్రవంతి

నున్న(విజయవాడరూరల్): విద్యార్థి దశ నుంచి పర్యావరణాన్ని పరిరక్షించడంపై అవగాహన కలిగి ఉండాలని ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ రాష్ట్ర సంచాలకులు పి.స్రవంతి అన్నారు. నున్న గ్రామంలో కెనడీ ఇంగ్లిషు మీడియం హైస్కూల్‌ను మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షిస్తే మనం అందరం ఆరోగ్యంగా జీవిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ విద్యను అమలు చేస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని పెంచడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చునని సూచించారు. ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న విపరీతమైన మార్పుల గురించి అవగాహన కల్పించి విద్యార్థులను పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు చేయటం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని, అందులో భాగంగా తాను హైస్కూల్‌ను సందర్శించానన్నారు. కార్యక్రమంలో నేషనల్ గ్రీన్ కోర్ క్లస్టర్ కోఆర్డినేటర్ షేక్ సాయిరున్నీసా బేగమ్, ప్రాజెక్ట్ అధికారి సత్యనారాయణ, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

గోవిందా...హరి గోవిందా..భజగోవిందా!

- శ్రీమహావిష్ణువు సేవలో తరిస్తున్న దంపతులు
- 20 అడుగుల తులసి గజమాలలు తయారీ
- శ్రీగోవిందనామ ప్రచార సేవా సంఘం సేవలు
- ఆధ్యాత్మిక మార్గం వైపు యువతను మళ్లిస్తున్న వైనం


తులసి గజమాలలను కడుతున్న గోవిందనామ ప్రచార సేవా సంఘం సభ్యులు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): తులసి మాలికా కైంకర్యం 'గోవింద' దాసుల కర్తవ్యం అంటారు భవానీపురానికి చెందిన శ్రీగోవిందనామ ప్రచార సేవా సంఘం వ్యవస్థాపకులు సునీతా-మధుసూదన్‌లు. చాత్తాద శ్రీవైష్ణవ సంప్రదాయంలో భాగంగా శ్రీమహావిష్ణువుకు సేవ చేసే మార్గాన్ని ఎన్నుకున్నారు ఆ దంపతులు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖకు చెందిన స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్ (సీత) పూర్వ డైరెక్టర్ డాక్టర్ చిలకపాటి విజయ రాఘవాచార్యులు మార్గదర్శకత్వంలో 2008లో శ్రీగోవిందనామ ప్రచార సేవా సంఘాన్ని స్థాపించిన ఆ దంపతులు భవానీపురం హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని తమ నివాసంలో చిన్న పిల్లలను, యువతను చేరదీసి భగవద్గీత, శ్రీవిష్ణు సహస్ర నామ స్తోత్రం వంటి స్తోత్ర పాఠాలను నేరిస్తూ వారిని ఆధ్యాత్మిక మార్గం వైపు మళ్లిస్తున్నారు. వారికి భగవద్గీత శ్లోకాల పఠనంలో పోటీలు నిర్వహించి ప్రోత్సహిస్తున్నారు.

'శ్రీహరిప్రియ'వనంలో తులసి మొక్కల పెంపకం

ఎన్టీఆర్ జిల్లా వెలగలేరు గ్రామంలో భూములను లీజుకు తీసుకుని 'శ్రీహరిప్రియ వనం' పేరుతో తులసి మొక్కలను పెంచుతున్నారు. కొంత భాగం ఆ వనంలో నుంచి మరికొంత భాగం చెన్నై నుంచి తెప్పించి వాటన్నింటితో తమ నివాసంలో తులసి గజమాలలు కట్టిస్తున్నారు. అందుకోసం ప్రత్యేక నిపుణులను నియమించుకున్నారు. షేక్ అహ్మద్, చిరంజీవి, శాయి శివకుమార్ నేతృత్వంలో గోవిందదాసులు మాలికలను కడుతున్నారు. ధనుర్మాసంలో ప్రస్తుతం నాలుగు ప్రముఖ వైష్ణవ దేవాలయాలకు తులసి దళాల గజమాలలను అందజేస్తున్నారు. ఒక్కొక్క గజమాల 20 అడుగులతో 15 నుంచి 20 కిలోల బరువు ఉంటుంది. లోక కల్యాణం కోసమే ఈ సేవ చేస్తున్నామని సునీత – మధుసూధన్ దంపతులు చెబుతున్నారు. నిరంతరం గోవిందనామ స్మరణ ప్రచారం, శ్రీరామపట్టాభిషేకం నిర్వహణ వారి ఆధ్యాత్మిక చింతనకు నిదర్శనం.


ద్వారకా తిరుమలలో తులసి మాలికలతో సునీత-మధుసూధన్ దంపతులు

గోవింద సేవా బృందాల సేవలు

శ్రీగోవిందనామ ప్రచార సేవా సంఘం వ్యవస్థాపకులు సునీత – మధుసూదన్, గోవింద సేవా బృంద సభ్యులు మోహన్, రమేష్, జగన్నాథం, లక్ష్మి, ఫణిబాబు, సుజాత, కొండమ్మ, శ్రీలక్ష్మి ముందు రోజు అర్ధరాత్రికే ఆయా దేవాలయాల సన్నిధులకు చేరుకుని తులసి గజమాలలను అందజేస్తారు. ఈ ధనుర్మాసం నెల పొడవునా ద్వారకా తిరుమలతో పాటు మంగళగిరి పానకాలస్వామి, తిరుపతి గోవింద రాజస్వామి, అహోబిలం లక్ష్మీనరసింహస్వామి దేవాలయాలకు తులసి గజమాలలను అందజేస్తున్నారు.

గోవిందనామ స్మరణం సర్వపాప హరణం



హిందూ ధర్మంలో తులసికి మించిన మంగళ మాలిక మరొకటి లేదు. 'గోవిందనామ స్మరణం సర్వపాప హరణం' అని విశ్వసించి 'గోవింద'నామ ప్రచారమే తమ జీవిత ధ్యేయంగా శ్రీమహావిష్ణువుకు సేవ చేస్తున్న సునీత–మధుసూదన్ దంపతులు ధన్యులు. తులసి మొక్కలను ఉచితంగా అందజేస్తున్న వీరు అభినందనీయులు.

– డాక్టర్ చిలకపాటి విజయ రాఘవాచార్యులు, పూర్వ సంచాలకులు, ఎస్ఐటీఏ

ఆర్చరీలో రాజేశ్వరి ప్రతిభ



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌పూర్‌లో ఈ నెల 5, 6 తేదీల్లో జరిగిన సబ్ జూనియర్ నేషనల్ ఆర్చరీ టోర్నమెంట్‌లో విజయవాడకు చెందిన టి.భువన రాజేశ్వరి సత్తా చాటింది. ఆ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభతో వేర్వేరు విభాగాల్లో రజత, కాంస్య పతకాలు గెలుచుకుంది. ఈ సందర్భంగా మంగళవారం ఆమె చదువుతున్న శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ, ఇతర అధ్యాపకులు, సహచర విద్యార్థినులు అభినందనలు తెలిపారు. ప్రిన్సిపాల్ పద్మజ మాట్లాడుతూ తమ విద్యార్థిని క్రీడల్లో సత్తా చూపి, చెన్నైలో జరిగే ఖేలో ఇండియాకి ఎంపిక అవడం ఆనందంగా ఉందని తెలిపారు. సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పి.లక్ష్మణరావు, కళాశాల కన్వీనర్ ఎన్.లలిత ప్రసాద్ అభినందనలు తెలిపారు.

ఇద్దరు నిందితుల అరెస్ట్

నాగాయలంక: పెదపాలెం గ్రామంలో గత ఆదివారం రాత్రి జరిగిన విజయవాడ యువకుడు షేక్ షరీఫ్ హుస్సేన్ హత్యాయత్నం కేసులో ఇరువురు నిందితులను అరెస్ట్ చేశామని మంగళవారం రాత్రి నాగాయలంక ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ ఘటనలో షరీఫ్‌పై కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపర్చిన బొడ్డు అర్జున రావు (45), బొడ్డు వెంకట నాగరాజు (19) గ్రామంలోని చిన్న లాకుల సెంటర్‌లో తమను చూసి పారిపోతుండగా పట్టుకున్నామన్నారు. హత్యాయత్నానికి వినియోగించిన కత్తి,నిందితులను అవనిగడ్డ కోర్టులో హాజరు పర్చగా ఈ నెల 22 వరకు కోర్టు రిమాండ్ విధించిందని చెప్పారు.

ఆరోగ్య సురక్షతో ప్రజలకు ఎంతో మేలు


పెనమకూరులో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ రాజామణి, జెడ్పీటీసీ రామ్మోహన్‌రెడ్డి


పామర్రు సచివాలయం-1వద్ద సురక్ష వైద్య శిబిరంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్

తోట్లవల్లూరు: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలతో ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని తోట్లవల్లూరు ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ జొన్నల రామ్మోహన్‌రెడ్డి తెలియజేశారు. పెనమకూరు సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం మంగళవారం జరిగింది. డాక్టర్ మాధవి, డాక్టర్ శ్రావ్, డాక్టర్ అఖిల్‌వర్ధన్, 361 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. శిబిరాన్ని ఎంపీపీ , జెడ్పీటీసీ సందర్శించి పరిశీలించారు. సర్పంచ్ నందేటి గంగాభవాని, ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, తహసీల్దార్ ఎం.కుసుమకుమారి, ఎంపీటీసీ మరీదు మధుబాబు, యరగాని శివ శంకర్, మరీదు మధుసూదనరావు, బయవరపు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం

గుడివాడరూరల్: పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని గుడివాడ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్‌పర్సన్ మట్టా నాగమణివిక్టర్, ఎంపీపీ గద్దే పుష్పరాణి పేర్కొన్నారు. మల్లాయపాలెం-1 సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష-2వ విడత వైద్య శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు నిరంతరం పాటుపడుతున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్ మాట్లాడారు. మోటూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దీప్తి, ఎంపీడీవో వెంకటరమణ, వైఎస్సార్ సీపీ నాయకులు గద్దే వెంకటరామాంజనేయులు (రాము), కురుచేటి కృష్ణ, ఉలవశెట్టి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ, ఉద్యోగులు, వలంటీర్లు, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదలు ఆరోగ్యంగా ఉండాలనే..

పామర్రు: ప్రజలకు ఆరోగ్య సంరక్షణ కల్పించాలనే ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తోందని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. పామర్రు సచివాలయం-1 పరిధిలోని సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజా ప్రతినిధులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పామర్రు గ్రామ సర్పంచ్ కె.కస్తూరి అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఏ రమాదేవి, దేవిరెడ్డి బాలవెంకటేశ్వరరెడ్డి, ఎండీ హస్మతుల్లా, ముప్పిడి సురేష్‌రెడ్డి, ధనాలక్ష్మపావతి, ఏఎంసీ డైరెక్టర్ కూసం పెద వెంకటరెడ్డి, ఎంపీడీవో వై రామకృష్ణ, గ్రామకార్యదర్శి అబ్దుల్ సలీం, పామర్రు కమ్యూనిటీ హెల్త్ సెంటర్, పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి పర్యటనకు భారీ ఏర్పాట్లు

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీవాణి


సభాప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీవాణి

కోడూరు: కేంద్ర పర్యాటక శాఖ సహాయ మంత్రి శ్రీపాద యశోనాయక్ పర్యటనకు అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. కోడూరులో బుధవారం జరిగే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సభలో యశోనాయక్ పాల్గొంటారని ఆర్డీఓ శ్రీవాణి తెలిపారు. కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అన్ని శాఖల అధికారులతో ఆర్డీఓ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు సభ ప్రారంభమవుతుందని, రెండు గంటల పాటు సభ ఉంటుందన్నారు. సభా ప్రాంగణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన పథకాలను వివరిస్తూ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్డీఓ తెలిపారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు జిల్లా అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. వైద్య సిబ్బంది సభ ప్రాంగణంలో తప్పనిసరిగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తమకు కేటాయించిన పనులను అధికారులు పూర్తి చేసి, సభను విజయవంతం చేయాలని ఆర్డీఓ కోరారు. అనంతరం ఆర్డీఓ శ్రీవాణి సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. అవనిగడ్డ సీఐ రమేష్ బందోబస్తుకు సంబంధించి పలు సూచనలిచ్చారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ షేక్ లతీఫ్ పాషా, ఈఓపీఆర్డీ నాగరేవతి, ఈఓ యలవర్తి సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జూదాలకు యువత దూరంగా ఉండాలి

తోట్లవల్లూరు: కోడిపందేలకు, జూదానికి యువత దూరంగా ఉండాలని పమిడిముక్కల సీఐ ఎం.కిషోర్‌బాబు సూచించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పోలీసు శాఖ ఆధ్వర్యాన స్థానిక జెడ్పీ పాఠశాలలో సంక్రాంతి సంబరాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ నెల 9 నుంచి 12 వరకు యువతకు వాలీబాల్, రన్నింగ్, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు సీఐ కిషోర్‌బాబు తెలియజేశారు. సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించటంలో భాగంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీలలో యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలని, విజేతలకు బహుమతులు అందిస్తామని తెలిపారు. సర్పంచ్ పెనుమత్స రాధిక, ఎస్ఐ పి.విశ్వనాథ్, వైఎస్సార్ సీపీ నాయకుడు ఈడ్పుగంటి రూబెన్, తదితరులు పాల్గొన్నారు.

నగదు స్వాధీనం



గూడూరు: జిల్లా ఎస్పీ పి.జాషువా ఆదేశాల మేరకు బందరు డీఎస్పీ యు.నాగరాజు పర్యవేక్షణలో గూడూరు సెంటరులో మంగళవారం పెడన సీఐ హబీబ్ బాషా, గూడూరు ఎస్ఐ శేషుకుమార్ తమ బృందంతో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో భీమవరం నుంచి ఒంగోలు వెళ్తున్న నువ్వుల వ్యాపారి వద్ద రూ.7.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ హబీబ్ బాషా వెల్లడించారు. ఈ నగదుకు సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లుతెలిపారు.

టిప్పరు లారీ ఢీకొని కిరాణా వ్యాపారి మృతి

గన్నవరం: స్థానిక కోనాయి చెరువు వద్ద టిప్పరు లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం...మండలంలోని కేసరపల్లి శివారు వీఎస్ పురం కాలనీకి చెందినతిరువీధులశ్రీనివాసులు (50) కిరాణా షాపు నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం గన్నవరం వెళ్లి మోపెడ్‌పై తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. స్థానిక కోనాయ చెరువు వద్ద ఎదురుగా దూసుకువచ్చిన టిప్పరు లారీ ఢీకొట్టింది. తలకు గాయాలు కావడంతో శ్రీనివాసులు అక్కడికక్కడే మృతి చెందాడు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతునికి భార్య,ఇరువురు కుమార్తెలు, ఓ కుమారుడుఉన్నారు.అతివేగంవలన తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

పామర్రు సీటును సీఎంకు బహుమతిగా ఇద్దాం

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



పమిడిముక్కల: పామర్రు సీటును సీఎం వైఎస్ జగన్‌కు బహుమతిగా ఇద్దాం..గత ఎన్నికల్లో జిల్లాలో అత్యధిక మెజార్టీతో గెలిపించారని, ఈసారి అంతకంటే ఎక్కువ మెజార్టీతో గెలిపించి పామర్రు సీటును సీఎంకు బహుమతిగా ఇద్దామని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పార్టీ శ్రేణులకు సూచించారు. పల్లెపల్లెను చైతన్య పరుస్తూ 3,648 కి.మీ సాగించిన ప్రజాసంకల్పయాత్రకు మంగళవారంతో ఐదేళ్లు పూర్తయింది. ఈ సందర్భంగా వీరంకిలాకు సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పూలమాలేసి నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిక కేక్‌ను ఎంపీపీ కాసాని వేద సుప్రజతో కలిసి కట్ చేసి నాయకులకు పంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్‌కుమార్ మాట్లాడుతూ పాదయాత్రలో ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని మేనిఫెస్టోలో పెట్టి, 99 శాతం ఎన్నికల వాగ్దానాలకు నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. విద్యా, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, నాడు–నేడులో పాఠశాలలను, ఆసుపత్రులను అభివృద్ధి చేశారని తెలిపారు. అభివృద్ధి లేదని టీడీపీ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని, గ్రామాల్లో నిర్మిస్తున్న సచివాలయ భవనాలు, రోడ్లను చూసి మాట్లాడాలన్నారు. సామాజిక వర్గాల మధ్య వైషమ్యాలు పెంచి లబ్ధి పొందేందుకు టీడీపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. టీడీపీ దుష్ప్రచారాలను నమ్మవద్దన్నారు. సోమవారం సీఎంను కలిసి అభివృద్ధిపై చర్చించానన్నారు. త్వరలోనే ఎన్నికలు ఉన్నాయని సుపరిపాలన అందిస్తున్న సీఎం జగన్‌ను, తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్న పాలన కావాలంటున్న ప్రజలు



గుడివాడ టౌన్: 'ఏపీకి జగనన్నే ఎందుకు కావాలంటే' కార్యక్రమం మంగళవారం పట్టణంలోని 35వ వార్డు సచివాలయంలో జరిగింది. జగనన్న నాలుగున్నర సంవత్సరాల పాలనలో 35వ వార్డుకు చెందిన 2,313 మంది లబ్ధిదారులకు ప్రత్యక్షంగా రూ.9 కోట్ల 11 లక్షల 40 వేల 200, 1,026 మంది లబ్ధిదారులకు పరోక్షంగా రూ.3 కోట్ల 76 లక్షల 58 వేల 624, మొత్తం రూ.12 కోట్ల 87 లక్షల 98 వేల 824 రూపాలయలు లబ్ధి చేకూర్చారని అందుకే జగనన్న పాలన మళ్లీ ప్రజలు కోరుకుంటున్నారని వక్తలు అన్నారు. మున్సిపల్ మేనేజర్ ఐ శ్రీనివాసులు, ఆర్వో విజయ్ కుమార్, టీపీఓ నాగేంద్ర ప్రసాద్, వైఎస్సార్ సీపీ కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి, సచివాలయాల ఇన్‌చార్జ్ వీరిశెట్టి నరసింహరావు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ బాజీ, వైఎస్సార్‌సీపీ నాయకులు సింగిరెడ్డి గగారిన్, ఏలేటి విలియం జోషి తదితరులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ ప్రారంభం

మండవల్లి: భారతరత్న బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని స్థానిక సచివాలయం వద్ద సర్పంచ్ మెండా ఝాన్సీ మంగళవారం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్, కార్యదర్శి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు



గుడివాడ టౌన్: పట్టణంలోని ఏజీకే మున్సిపల్ హైస్కూల్, విద్యావికాస్ పాఠశాలల్లో మంగళవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంక్రాంతి పర్వదినం ప్రత్యేకతను వివరిస్తూ భోగిమంటలు వేశారు. విద్యావికాస్ పాటశాలలో డైరెక్టర్లు ముప్పాళ్ల సుబ్బారావు, కొమ్మినేని సాంబశివరావు భోగి మంటలు వెలిగించారు. స్థానిక ఏజీకే హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలు పీఎల్ నర్సమాంబ సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. రంగవల్లులు, చిన్నారులకు భోగి పళ్లు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, సోదెమ్మ చిలుకపలుకులు, సంప్రదాయ వస్త్రాధారణ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు బృందగానం ఆలపించగా చిన్నారులు నృత్యం చేశారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్‌పర్సన్ సత్యవతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

మొవ్వ: స్థానిక క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ ప్రభుత్వ కళాశాలలో మంగళవారం సంక్రాంతి పండుగని పురస్కరించుకుని నిర్వహించిన రంగవల్లుల పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో 72 మంది ఇంటర్ విద్యార్థులు పాల్గొని పలు రకాల ముగ్గులను ఆకర్షణీయం తీర్చిదిద్దారు. న్యాయ నిర్ణేతలుగా హిస్టరీ అధ్యాపకురాలు పద్మ, ఓఏఎస్ అధ్యాపకులు గౌరమ్మ, రంగనాయకులు వ్యవహరించారు. విజేతలకు బుధవారం ప్రోత్సాహక బహుమతులను అందజేయనున్నట్లు కళాశాల ప్రధాన అధ్యాపకులు కేవీఎస్‌పీ ప్రసాద శాస్త్రి తెలిపారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం



తాడంకి(పమిడిముక్కల): జూద క్రీడలు వద్దు..సాంప్రదాయ క్రీడలు ముద్దని పమిడిముక్కల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.కిషోర్ బాబు తెలిపారు. తాడంకి హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాల్లో భాగంగా పమిడిముక్కల సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలను సీఐ ప్రారంభించారు. కొద్ది సేపు వాలీబాల్ ఆడి యువతను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా సీఐ కిషోర్ బాబు మాట్లాడుతూ పేకాట, కోడిపందేల జోలికి వెళ్లవద్దన్నారు. పండుగ పేరుతో జూదక్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆడుదాం..ఆంధ్ర కింద ప్రభుత్వం నిర్వహిస్తున్న కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని సత్తా చాటాలన్నారు. వాలీబాల్ విజేత జట్టుకు తాను బహుమతులు అందజేస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ కిషోర్ కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో వైద్యం ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్సీ జయమంగళ, ఎమ్మెల్యే డీఎన్నార్



భైరవపట్నంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ, ఎమ్మెల్యే డీఎన్నార్

మండవల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆలోచన ద్వారానే గడప గడపకు వైద్య సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ పేర్కొన్నారు. మండలంలోని భైరవపట్నంలో గడప గడపకు ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం జరిగింది. రూ.20 లక్షల 80 వేల నిధులతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. శిలాఫలకం ఆవిష్కరించారు. గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరూ వైద్య కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా గ్రామంలోనే ఉన్న ఆరోగ్య కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ (రాము), జెడ్పీటీసీ ముంగర విజయనిర్మల, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, రాష్ట్ర నాయకులు సయ్యపురాజు గుర్రాజు, గాదిరాజు భాస్కరరాజు, సర్పంచ్ నీలపాల రాధానాగేంద్ర, ఎంపీటీసీ నాగదాసి కిరీటిరాజు, మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు బేతపూడి యేసోబురాజు, మెండా సురేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటరత్నం, బొమ్మనబోయిన గోకర్ణయాదవ్, వ్యవసాయ సలహామండలి అధ్యక్షురాలు కూరెళ్ల యేసుమరియమ్మ, తహసీల్దార్ సీకే వెంకటరమణ, మాజీ ఎంపీపీ సాకా జసింత, కన్వీనర్లు వల్లూరి ఆదినారాయణ, కోట మేరీ, బోయిన నాగరాజు, కనుమూరి వాసురాజు, కలిదిండి శ్రీహరిబాబు, కొమ్మన సత్యనారాయణ, చదలవాడ శ్రీమన్నారాయణ, కన్నె పాముల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి చిరునామా ఆంధ్రప్రదేశ్

కైకలూరు: ఆరోగ్య అభివృద్ధికి చిరునామాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నిలుస్తోందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. రెండో విడత జగనన్న సురక్ష కార్యక్రమం వదర్లపాడు గ్రామంలో మంగళవారం జరిగింది. ముందుగా వివిధ విభాగాలకు చెందిన స్టాల్స్‌ను ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల వరకు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలను ప్రభుత్వం భరిస్తోందన్నారు. ఈ నెల 19న విజయవాడలో జరగనున్న అంబేడ్కర్ స్మృతివనం పోస్టర్లను ఆవిష్కరించారు. వదర్లపాడులో రూ.17.50 లక్షల మండల పరిషత్ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ శంకుస్థాపన చేశారు. నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు నిర్మాణం జరగాలన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు ప్రజావేదిక

తోట్లవల్లూరు: ఉపాధిహామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక తోట్లవల్లూరులో బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తుంగల స్వర్ణలత తెలియజేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉదయం 10 గంటలకు జరిగే ప్రజావేదికలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి మేట్లు, సిబ్బంది పాల్గొనాలని ఆమె కోరారు.

అలరించిన నగర సంకీర్తన

మండవల్లి: మండవల్లి శ్రీ షిర్డీసాయిబాబా భక్త సమాజం ధనుర్మాసం, పురస్కరించుకుని నిర్వహిస్తున్న నగర సంకీర్తన కార్యక్రమం భక్తులను ఎంతో అలరిస్తుంది. మంగళవారం స్థానిక స్టేషన్‌రోడ్, అగ్రహారంలో నగరసంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే గృహస్తులను సాయినామ సంకీర్తనతో మేల్కొలుపుతారు. బాబా ఫొటో ధరించిన వ్యక్తికి ఆ ఇంటిలోని వారు బాబా మాదిరిగా కొలిచి బిక్ష వేస్తారు. ఈ సందర్భంగా బాబా విగ్రహానికి పూజలు నిర్వహించి బియ్యం, నగదు వేసి స్వామి వారిని కొలుస్తారు. మాజీ సర్పంచ్ గుడివాడ చిట్టిబాబు, బండారు వెంకయ్య, యిన్నా వెంకటేశ్వరరావు, పయ్యావుల సత్యనారాయణ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ విజయవంతం చేయండి

ఏఎంసీ చైర్‌పర్సన్ మట్టా, ఎంపీపీ గద్దే



మల్లాయపాలెం వద్ద సంతకాల సేకరణను ప్రారంభిస్తున్న ఎంపీపీ, పక్కన ఏఎంసీ చైర్‌పర్సన్

గుడివాడరూరల్: ఈ నెల 19వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించనున్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గుడివాడ మార్కెట్‌యార్డ్ కమిటీ చైర్‌పర్సన్ మట్టా నాగమణివిక్టర్, ఎంపీపీ గద్దే పుష్పరాణి పేర్కొన్నారు. మండలంలోని మల్లాయపాలెం సచివాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. తొలుత ఏఎంసీ చైర్‌పర్సన్, ఎంపీపీలు సంతకాలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడిన మహోన్నతమైన వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు రంగులు వేసి రేపురేఖలు మార్చాలని పిలుపునిచ్చారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, ఎంపీడీవో వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, మల్లాయపాలెం గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

పామర్రు: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం మధ్యాహ్నం 2.30 నిమిషాలనుంచి 5 గంటల వరకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం జరుగుతుందని పామర్రు ఎంపీడీవో వై.రామకృష్ణ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా న్యూఢిల్లీ, కేంద్ర టూరిజమ్ శాఖ మంత్రి షరిపాద్ యశో నాయిక్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని అన్నారు.

సంక్షేమ వెలుగులు నింపిన యాత్రకు ఐదేళ్లు

వైఎస్సార్ సీపీ శ్రేణుల సంబరాలు



గుడివాడ టౌన్: తండ్రి ఆశయాలు నెరవేర్చాలనే సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా చేసిన ప్రజా సంకల్ప యాత్ర ముగిసి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం సంబరాలు చేశారు. తొలుత నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి అభినందనలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బడుగు, బలహీన, వెనుకబడిన సమాజం అభివృద్ధి చెందాలనే సంకల్పంతో సుదీర్ఘ పాదయాత్ర చేసిన ఏకైక నాయకుడు జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. 341 రోజులపాటు 3,648 కిలోమీటర్లు సుదీర్ఘ పాదయాత్ర చేసి ప్రజల మన్ననలు పొంది ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారన్నారు. తన పాదయాత్రలో ప్రజల కష్టాలను గుర్తించి వారి సమస్యల పరిష్కారాన్ని ఒక మేనిఫెస్టోగా రూపొందించి ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలు కూడా ప్రథకాల రూపంలో ప్రజలకు అందించిన నాయకుడు జగన్ మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు మాదాసు వెంకట లక్ష్మీకుమారి, వీరిశెట్టి నరసింహారావు, పార్టీ నాయకులు సింగిరెడ్డి గగారిన్, కె.ఆంజనేయ ప్రసాదు, చుండూరి శేఖర్, వెంపటి సైమన్, జోగా నాగేశ్వరరావు, నీలాకాంత్, మామిళ్ల ఎలీషా, సంచార జాతుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సయ్యద్, అలి, మహిళా కార్యకర్తలు మూడెడ్ల ఉమ, హారిక, దేవి, సునీత, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర భూసర్వేతో వివాదాలకు చెక్

- ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- 314 మంది రైతులకు భూ హక్కు పత్రాల పంపిణీ



ఫత్తేలంకలో రైతులకు భూహక్కు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

ఫత్తేలంక (పమిడిముక్కల): వందేళ్ల తర్వాత రాష్ట్రంలో సమగ్ర భూసర్వే చేపట్టి భూ వివాదాలకు చరమగీతం పాడినట్లు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఫత్తేలంక గ్రామంలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష పథకం కింద 388 ఎకరాలకు సంబంధించి 314 మంది రైతులకు ఎమ్మెల్యే భూ హక్కు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్‌కుమార్ మాట్లాడుతూ భూ రికార్డులు సరిగా లేక రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడేవారన్నారు. నేడు డ్రోన్‌ల ద్వారా సర్వే చేసి సరిహద్దు రాళ్లు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రీ సర్వే ద్వారా గతంలో రిజిస్ట్రేషన్ చేసుకోనివారు కూడా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చన్నారు. తహసీల్దార్ డెక్కా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ మండలంలోని 28 గ్రామాలకు గాను 17 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందన్నారు. ఎంపీపీ కాసాని వేద సుప్రజ, తోట్లవల్లూరు జెడ్పీటీసీ జొన్నల రామ్మోహనరెడ్డి, సర్పంచ్ హిదయతుల్లా, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, రాష్ట్ర రెడ్డిక, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్లు కంభపు రాంబాబు, శొంఠి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు యలమంచిలి గణేష్, రాజులపాటి రాఘవరావు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గుంటూరు వెళ్లి పింఛన్ అందజేత



గుడివాడ టౌన్: పట్టణంలోని 8వ వార్డుకు చెందిన ధర్మపురి దుర్గ పేగుపూతతో బాధపడుతూ గుంటూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వలంటీరు ఎల్.మనీషాదేవి గుంటూరు వెళ్లి ఆసుపత్రిలోని దుర్గకు పింఛన్ అందజేశారు. దీనిపై దుర్గ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారని మనీషాదేవి అన్నారు.

జూదం చట్టరీత్యా నేరం

మండవల్లి: మండలంలోని పెరికెగూడెంలో ఎస్ఐ సీహెచ్ఎస్ రామచంద్రరావు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేకాట, కోడిపందేలు, గుండాట, ఇతర జూదాలు ఆడటం చట్టరీత్యా నేరమన్నారు. వీటిని అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పెరుమాళ్ల సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ పెరుమాళ్ల పెద వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కైకలూరులో వైద్యరంగం కళకళ

- శరవేగంగా విస్తరిస్తున్న వైద్యసేవలు
- అందుబాటులో ఆక్వా మందుల దుకాణాలు



కైకలూరు: పట్టణంలో వైద్యరంగం నానాటికి విస్తరిస్తోంది. ఆక్వా ఉత్పత్తులలో దేశ స్థాయిలో నంబర్ వన్ స్థానాన్ని పదిలపర్చుకుంటున్న కైకలూరులో వైద్యం, వ్యాపార, ఆక్వా రంగాల్లో శరవేగాన్ని పుంజుకుంటోంది. పూర్వం కైకలూరు పట్టణం నుంచి పలు సేవల నిమిత్తం విజయవాడ, భీమవరం, ఏలూరు వంటి పట్టణాలకు ప్రజలు వెళ్లేవారు. నేడు ఆ పరిస్థితి లేదు. కైకలూరులోనే గుండె, చిన్నపిల్లలు, ఎముకలు, దంత, షుగర్ వ్యాధుల స్పెషలిస్టులు అందుబాటులో ఉన్నారు. పూర్వం ప్రమాదం జరిగి ఎముకలు విరిగితే గుడివాడకు తరలించేవారు. నేడు కైకలూరులోనే అత్యాధునిక వైద్యం అందుబాటులోకి వచ్చింది. రహదారి సౌకర్యాలు ఉండటంతో ప్రజలు నిత్యం కైకలూరుకు వివిధ పనుల నిమిత్తం వస్తున్నారు. కొల్లేరు ప్రాంతాల్లో లభించే సహజసిద్ధ చేపలైన కొరమేను, బొమ్మిడాయిలు వంటి చేప కూరలకు పలు హోటల్స్ స్పెషల్‌గా నిలుస్తున్నాయి.

అందుబాటులో ఆక్వా దుకాణాలు..

కైకలూరులో ఆక్వా దుకాణాలు రైతులకు అందుబాటులో ఉంటున్నాయి. సుమారు ఒక్క కైకలూరులోనే 55 ఆక్వా దుకాణాలు రైతులకు వివిధ రకాలైన చేపలు, రొయ్యల సాగు మందులను అందిస్తున్నాయి. చేపలు, రొయ్యలలో వచ్చే వ్యాధుల నిర్ధారణకు ఆక్వా లాబోరేటరీలు పనిచేస్తున్నాయి. కైకలూరు ప్రాంతం ఆక్వాహబ్‌గా పేరుగాంచడంతో చేపలు, రొయ్యలు ఆయా మార్కెట్లలో ప్రజలకు అందుబాటులో ఉంటున్నాయి. ప్రభుత్వం చేపలలో పౌష్టికాహార విలువలు ఉన్నాయని, ఎక్కువ మంది వీటిని ఆహారంగా తీసుకోవాలని సూచిస్తోంది. ఇటు వైద్యసేవల్లోనూ, అటు ఆక్వారంగంలోనూ కైకలూరు ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలుస్తోంది.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

రిమ్మనపూడి(పామర్రు): పాల ఉత్పత్తి దారుల అభ్యున్నతే ధ్యేయంగా విజయవాడ కృష్ణా మిల్క్ యూనియన్ కృషి చేస్తోందని పామర్రు పాల శీతల కేంద్రం మేనేజర్ చిట్టూరి దామోదర కృష్ణ గోపినాథ్ అన్నారు. మండలంలోని రిమ్మనపూడి పాల సేకరణ కేంద్రంలో మంగళవారం రాత్రి పాల ఉత్పత్తిదారులకు బోనస్సును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ పరిధిలోని 89 మందికి సొసైటీ ఆడిట్ ద్వారా వచ్చిన లాభాలను బోనస్సుగా రూ.95 వేలను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పాలసేకరణకేంద్రం అధ్యక్షుడు అనిల్‌కుమార్, వేతన కార్యదర్శి సత్యం, సంఘ సభ్యులు, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.